క్లుప్తంగా

చంద్ర రాజేశ్వరరావు పోరాటాలు స్ఫూర్తిదాయకం



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): భూమి కోసం, భుక్తి కోసం దేశవ్యాప్తంగా సీపీఐ అగ్ర నాయకులు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు సాగించిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలం సీపీఐకి కార్యదర్శిగా ప్రపంచంలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి కృషిచేసిన చంద్ర రాజేశ్వరరావు మహనీయుడని పేర్కొన్నారు. రాజేశ్వరరావు 31వ వర్ధంతి కార్యక్రమం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో బుధవారం బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ ప్రజాసంఘాల నాయకులు పుప్పాల కన్నబాబు, సన్నేపల్లి సాయిబాబు, కొండేటి బేబీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు మెంబర్ మృతి



మేరీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మల్కాపురం పంచాయతీ వార్డు మెంబర్ మేరీ ఆకస్మిక మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని వడ్డీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, పార్టీ రాష్ట్ర నేత పల్లెంప్రసాద్ అన్నారు. బుధవారం మల్కాపురంలో మేరీ నివాసంలో ఆమె మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, మల్కాపురం సర్పంచ్ సునీత, సర్పంచ్ ప్రభుదేవా, ఎంపీటీసీ, ఉప సర్పంచ్ నిరంజన్, సురేంద్ర వార్డు మెంబర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్షలు

ద్వారకాతిరుమల: గురుకులాల్లో ప్రవేశానికి ఈనెల 13న పరీక్ష నిర్వహించనున్నట్టు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఆరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

వెలవెలబోతున్న పార్కులు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ఏలూరు నగరంలోని పార్కుల దుస్థితి
- కనీస నిర్వహణను పట్టించుకోని నగరపాలక సంస్థ

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలోని పార్కులన్నీ కనీస నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. చిన్నారులు, పెద్దలు, వృద్ధులు ఇలా అందర్నీ ఆహ్లాద పర్చిన పార్కుల పర్యవేక్షణను నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇందుకు నగర పాలక సంస్థ 2024–25 బడ్జెట్లో పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం నిదర్శనం.

సంజయ్ జాజు హయాంలో అభివృద్ధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సంజయ్ జాజు హయాంలో నగరంలోని పార్కులకు స్వర్ణయుగంగా చెప్పవచ్చు. నగరంలోని ప్రధానంగా ఉన్న 14 పార్కుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించారు. పార్కుల చుట్టూ సిమెంట్ డిజైన్లు, వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆటవిడుపు కోసం ఊయలలు, జారుడు బల్లలు ఇలా రకరకాల హంగులు కల్పించారు. ఏలూరు మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న కృష్ణా కెనాల్ వెంబడి సిమెంట్ డివైడర్లను ఏర్పాటు చేసి రంగులతో తీర్చిదిద్దారు. నాటి వైభవాన్ని పార్కులకు తీసుకొచ్చే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

60 వేలకు పైగా చిన్నారులు

ఏలూరు నగరంలో 60 వేలకు పైగా చిన్నారులు ఉన్నారు. జనాభా దాదాపు నాలుగు లక్షల మంది ఉన్నారు. వీరిలో సుమారు 60 వేల మంది వరకు 15 ఏళ్లలోపు బాలబాలికలు ఉన్నారు. వీరందరికీ సెలవు రోజుల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు సరైన పార్కుల సదుపాయం లేదు. ప్రధానంగా ఆర్ఆర్‌పేట ఎన్‌టీఆర్ పార్కు, పత్తేబాద బృందావనం పార్కు, ఏటిగట్టున ఉన్న జన్మభూమి పార్కులు కొద్దిగా చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మిగతా పార్కులన్నీ శిథిలావస్థకు చేరాయి. ఉన్న రెండు మూడు పార్కులు సెలవు రోజుల్లో చిన్నారులకు పూర్తిస్థాయిలో సరిపోయే పరిస్థితి లేదు.

అసాంఘిక కార్యకలాపాలు

అభివృద్ధికి నోచుకోని కొన్ని పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇవి కాలేజీకి డుమ్మా కొట్టిన విద్యార్థులు, ప్రేమ జంటలు, పిక్ పాకెటర్స్, మందు బాబులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఏటిగట్టు ప్రాంతంలోని జన్మభూమి పార్కులో పట్టపగలే పలువురు మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు. ప్రేమ జంటలు బల్లలపై కూర్చుని సేదతీరడం కన్పిస్తుంది.



టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జన్మభూమి పార్కు ముఖద్వారం



పార్కులో ధ్వంసమైన వాటర్ ఫౌంటెయిన్



జన్మభూమి పార్కులో పాడైన ఆట వస్తువు



అమీనాపేట ఏటిగట్టు వద్ద గల పార్కులో శిథిలమైన జారుడు బల్ల

అభివృద్ధి చేయాలి



నగరంలోని పార్కులు సరైన నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉన్న పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. దీనికి నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. చిన్నారులు, పెద్దలు, వృద్ధులకు ఆటవిడుపుగా ఉండే పార్కుల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. కుటుంబం అంతా కలిసి పార్కులో సేదతీరే విధంగా వినియోగంలోకి తేవాలి.

– చిలకలపల్లి కట్టయ్య, జిల్లా అధ్యక్షుడు, రజక జన సంఘం, ఏలూరు

నిధులు కేటాయించాలి



నగరంలోని పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. వీటిని సంరక్షించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలి. అన్నీ ఒకే సారిగా కాకపోయినా ప్రతి ఏటా కొన్ని చొప్పు నైనా పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా నగరంలోని చిన్నారులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి. పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలకు చోటులేకుండా నగర పాలక సంస్థ, పోలీస్ వ్యవస్థ అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ, ఏలూరు

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హైచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లెప్రసీ, యిడ్స్, టీబీ జిల్లా అధికారి ఎం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో మొబైల్ ఐసీటీసీ వ్యాన్ ద్వారా ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన, ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఎయిడ్స్‌పై అనుమానాలుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1097కు సంప్రదిస్తే పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారని డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి చక్రపాణి, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి రాజశేఖర్, మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ కేఆర్ సురేష్ బాబు, ల్యాబ్ టెక్నీషియన్ బి.హనుమంతు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోణంగి, వెంకన్న చెరువు ఫీడర్లలోని చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పడమర వీధి, వంగాయగూడెం, గొల్లాయగూడెం, గులాబీ తోట, కొబ్బరితోట, సుబ్రహ్మణ్యం కాలనీ, గాంధీ కాలనీ, క్యాన్సర్ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఊరి బడిని ఊరి తీయొద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఊరి బడిని ఉరి తీయవద్దని, ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడడానికి, పునర్నిర్మాణానికి చొరవ చూపాలని యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రుద్రాక్షి రవికుమార్ ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటులో అవలంబిస్తున్న విభిన్న పద్ధతుల వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. 60 మంది పైబడి విద్యార్థులు ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలలను దూరంతో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. పాఠశాలల విలీన ప్రక్రియను నిలిపివేసి ప్రజామోదయోగ్యమైన నిర్ణయాలను అమలు పరచాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్, నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు, కోశాధికారి కోరాడ కిరణ్ కుమార్, కామవరపుకోట బాధ్యులు మరీదు లక్ష్మణ్ ఉన్నారు.

మండుతున్న ఎండలు

ప్రజల బెంబేలు



దెందులూరు: భానుడి భగభగలతో జనం బెంబేలెత్తున్నారు. వడగాల్పుల ప్రభావంతో వేసవి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి 29న జిల్లాలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గడిచిన వారం రోజుల నుంచి సాధారణం కంటే అన్ని ప్రాంతాల్లోనూ మూడు, నాలుగు డిగ్రీల అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

పెరిగిన ఉష్ణోగ్రతలు

మండలంలో సోమవారం 36 నుంచి 38 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. గడిచిన నాలుగు రోజుల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 10 నుంచే ఉష్ణతాపం అధికంగా ఉంటోంది. పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత పెరగడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఉష్ణతాపం నుంచి ఉపశమనం కోసం ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, జ్యూస్‌లు ఇతర పానీయాలను సేవించి ఉపశమనం పొందడంతో వాటి వినియోగం, ధరలు విపరీతంగా పెరిగాయి.

రోగాల బారిన జనం

వృద్ధులు, చిన్నారులు ఎండల తీవ్రతను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలో సమతుల్యత దెబ్బతినడంతో అనేక మంది జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. ఎండల తారేత్తుస్తుండటంతో మధ్యాహ్నం సమయంలో రోడ్కలన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వ్యాపారాలు సైతం మందకొడిగానే సాగుతున్నాయి. దీంతో కొందరు వ్యాపారులు తమ దుకాణాలను మధ్యహ్నం సమయంలో మూసివేస్తున్నారు.



నిర్మానుష్యంగా మారిన రోడ్డు

తస్మాత్ జాగ్రత్త

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం తగిన నిద్ర పట్టపోవడం, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడం వంటి లక్షణాలను వడదెబ్బగా గుర్తించవచ్చు. ఎండాకాలో మాంసాహారం తగ్గించాలి. తాజా కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ, వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలి. మద్యం సేవించడం, కలుషితమైన ఆహారం తినడం చేయరాదు.

అప్రమత్తంగా ఉండాలి



పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వెంటనే ఆసుపత్రికి తరలించాలి. గాలి తగిలే ప్రదేశం, నీడలో ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకు చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరం తుడవాలి. ఓఆర్ఎస్ ద్రావణం, ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం తాగించాలి.

– పవన్, సీహెచ్ వైద్యాధికారి, దెందులూరు

● ప్రధాన రహదారిలో పార్కింగా!



కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో నిలిపిన కళాశాల బస్సు



కలెక్టరేట్ వద్ద నిలిపిన కళాశాల బస్సు

జిల్లా కార్యాలయాలన్నీ ఉండే ప్రాంతం. నిత్యం అధికారులు తిరుగుతునే ఉంటారు. ఇతర ప్రాంతాల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా వస్తుంటారు. ఈ రహదారి ప్రైవేటు కళాశాలల బస్సులకు పార్కింగ్ ప్రాంతంగా మారింది. మధ్యాహ్నం విద్యార్థులు వచ్చే సమయానికి కనీసం ద్విచక్రవాహనం వెళ్లడానికి కూడా దారుండదు. ఇటీవల ఆటోలు కూడా పెట్టడంతో మరో ఆటో స్టాండ్‌లా మారింది. పోలీసులు, అధికారులు చూసినా తమకెందుకే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్, జెడ్పీ కార్యాలయాల వద్ద బస్సులు, ఆటోలు నిలిపిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



జెడ్పీ గేటు వద్ద నిలిపిన ఆటోలు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	30	బీక్లచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	24	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	76
కాకర కాయలు	30-34	బీట్‌రూట్	30
బీరకాయలు	38	కీరా దోస	30
బీరకాయలు (పందిరి)	46	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

ఆక్వా రంగాన్ని కాపాడాలి

ఏలూరు (టూటౌన్): ఆక్వా రంగాన్ని కాపాడాలని, రొయ్యల రైతులను ఆదుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం ప్రతీకార సుంకాల పేరుతో భారత్ ప్రభుత్వంపై పెట్టిన భారం ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఆక్వా రైతాంగంపై తీవ్రమైన ప్రభావం చూపిందని, తద్వారా రొయ్యల రైతులు నష్టాలకు గురయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వం 100 కౌంట్ రొయ్యల ధర రూ.220కు కొనాలని నిర్ణయించినా, వ్యాపారులు సిండికేటుగా మారి రూ.200కే కొంటున్నారని తెలిపారు. వాస్తవానికి అమెరికా వంటి దేశాలకు 30, 40 కౌంట్ ఉన్న రొయ్యలను మాత్రమే ఎగుమతి చేస్తుంటారని, మిగిలిన 30 నుంచి 90 కౌంట్ రొయ్యల ధరలను ప్రభుత్వం ప్రకటించకపోవడం రైతాంగంలో గందరగోళం నెలకొందని వివరించారు. కేంద్రం మౌనం విడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని, అన్ని కౌంట్ల రొయ్యల ధరలు నిర్ణయించాలని, ఈ మేరకే వ్యాపారులు కొనేలా చూడాలని, ఫీడ్ కూడా నాణ్యమైనది, తక్కువ ధరకే అందించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం చైనా వలే ట్రంప్ సుంకానికి దీటుగా సమాధానం చెప్పి దేశ ప్రజలను కాపాడాలని కోరారు.

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం: వన్‌దన్ వికాస కేంద్రాలు గిరిజనుల ఆర్థికాభివృద్ధిలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తాయని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన మంగయ్యపాలెంలో సౌభాగ్యదుర్గ అడ్డాకుల ప్రోసెస్సింగ్ యూనిట్‌ను పీఓ బుధవారం పరిశీలించారు. అడ్డాకుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అడ్డాకుల సేకరణ, తయారు చేసే విధానాన్ని మహిళలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళా సంఘాలను క్లస్టర్‌లుగా ఏర్పాటు చేసి అటవీ ఉత్పత్తుల ప్రోసెస్సింగ్‌ను చేపట్టి, వాటి ద్వారా తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కలిగించేలా కృషి చేస్తామని పీఓ చెప్పారు. మహిళలు మరింత నైపుణ్యంతో విస్తర్లు తయారు చేసి అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలు మిర్చివాడ రామలక్ష్మి, మిర్చివాడ కనకరత్నం, వెలుగు సీసీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆ సిబ్బందిపై చర్యలేవి?

కుక్కునూరు : ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తూ.. అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ అధికారులపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి ప్రశ్నించారు. బుధవారం చిరవెల్లి గ్రామంలో యర్నం సాయికిరణ్ అధ్యక్షతన నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 11న అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న నర్సరీ యాజమాన్యం వివరాలు సేకరించే విషయమై తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీపీఎం నాయకుడు యర్రంశెట్టి నాగేంద్రరావు అక్కడి నుంచి విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగా, ఫోన్ లిఫ్ట్ చేసిన కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు తాను లైన్‌మెన్‌ను అంటూ నాగేంద్రరావును అవమానకరంగా మాట్లాడాడని తెలిపారు. దీంతో సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. ఏఈ పాపారావు, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని రవి హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, సభ్యులు మేడిపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.